
ప్రజాశక్తి
మంగళవారం 28 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం



హైకోర్టు న్యాయమూర్తిగా మానవేంద్రనాథ్



హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేస్తున్న మానవేంద్రనాథ్‌రాయ్

జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆయనతో న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయించారు. జస్టిస్ మానవేంద్రరాయ్ స్వస్థలం పార్వతీపురం. న్యాయవిద్య అభ్యసించిన తదుపరి 2002లో జిల్లా జడ్జి క్యాడర్లో నియమితులైన వీరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో న్యాయసేవలు అందించారు. గుజరాత్ హైకోర్టు నుంచి బదిలీపై తిరిగి సొంత రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. -ప్రజాశక్తి, పార్వతీపురం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి నారాయణ భరత్ గుప్తా

సబ్ కలెక్టర్లు ముంపు ప్రభావిత ప్రాంతాలను సందర్శించాలి

జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా

పార్వతీపురం : మొంథా తుపాను ప్రభావంతో జిల్లాలో ఎక్కడ ఎంత చిన్న సమస్య అయినా మా దృష్టికి తేవాలని జిల్లా ప్రత్యేక అధికారి నారాయణ భరత్ గుప్తా జిల్లా అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టర్లు మంగళవారం ముంపు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ముందస్తు చర్యలను పర్యవేక్షించాలని అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి, ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏదైనా జరిగితే వెంటనే గుర్తించి సమాచారం ఇవ్వాలని తెలిపారు. స్థానిక నాయకులు, యువత ద్వారా సమాచారం సేకరించాలని సూచించారు. పోలీస్ అధికారి, ఎంపిడిఒ, తహసీల్దార్ ఒక్కచోటే ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గూగుల్ లోకేషన్ తెప్పించుకుని కాజ్వేలు, కల్వర్ట్ లకు లింక్ చేసుకోవాలని హితవు పలికారు. విస్తృత వర్షాలు కురిసిన సమయంలో విద్యుత్ వినియోగంపై గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడా ఎటువంటి పంట నష్టం జరగరాదని, వసతి గృహాలన్నీ మరో మారు చెక్ చేసుకోవాలని, ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని తెలిపారు. తుఫాను ప్రభావం తగ్గేవరకు హాస్టళ్లలో విద్యార్థులుబయటకు రాకూడదని సూచించారు. జిల్లాలో ఎటువంటి పశు నష్టం జరగరాదని, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉండాలని చెప్పారు.

'పెద్దగెడ్డ' నుంచి 600 క్యూసెక్కుల నీరు విడుదల



పాచిపెంట: మండలంలోని పెద్దగెడ్డ జలాశయం నుంచి ఇరిగేషన్ అధికారులు సోమవారం 600 క్యూసెక్కుల నీటిని వేగవతి నదిలోకి విడుదల చేశారు. తుఫాను నేపథ్యంలో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు అధికంగా వచ్చే అవకాశం ఉన్నం దున ముందస్తు జాగ్రత్తగ జలాశ యంలో 80 శాతం నీరు ఉంచాలని పై అధికారుల ఆదేశాల మేరకు జలాశయం రెండో గేటు ద్వారా దిగుప్రాంతమైన వేగావతి నదిలోకి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు తెలిపారు. జలాశయం పూర్తి నీటిమట్టం 213.8 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 213.2 మీటర్లు ఉందని అధికారులు తెలిపారు

భయం గుప్పెట్లో అన్నదాత

- వెన్ను పొడిచే దశలో ముంచుకొచ్చిన తుపాను
- 'మొంథా' ముదిరితే భారీ నష్టమే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తుపాను రాకతో అన్నదాత కంట తీవ్ర కలవరం నెలకొంది. ఇప్పటికే అధిక వర్షాల కారణంగా మొక్కజొన్న, పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. మునుపెన్నడూ లేనంతగా ఈసారి వరి ఆశాజనకంగా ఉన్నప్పటికీ, మొంథా తుపాను తీవ్రంగా విరుచుకుపడితే వరి రైతులు కూడా భారీ నష్టాన్ని చవిచూసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచీ వర్షాలు పడుతుండటంతో రైతులు ఒకింత ఆశాభావంతో ఉండేవారు. జూన్‌లో నారు పోత, జులై నుంచి నాట్లు మొదలయ్యాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 1,76,356 ఎకరాలు కాగా, 1,79,500 ఎకరాల మేర నాట్లు పడ్డాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచీ పుష్కలంగా వర్షాలు కురవడం వల్ల లక్ష్యానికి మించి నాట్లు పడ్డాయి. దీనికి ముందే మొక్కజొన్న జిల్లాలో 15,029 ఎకరాల్లో, పత్తి 16,706 ఎకరాల్లో సాగయ్యాయి. ఈ రెండు పంటలూ కోతదశలో ఉన్నాయి. అధిక వర్షాలు మొక్కజొన్న, పత్తి పంటలపై తీవ్ర ప్రభావం చూపాయి. ముఖ్యంగా పొలాల్లో నీరు నిల్వ ఉండిపోవడం, కలుపు తీయడానికి సైతం అవకాశం ఇవ్వకపోవడం, ఎండబెట్టుకోవ డానికి కూడా వెసులుబాటు లేకపోవడం వంటి కారణాలతో దాదాపు 60 శాతం దిగుబడి తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తొలి నుంచీ వర్షాలు సహకరించడంతో వరి ఒకింత ఏపుగా పెరిగింది. ప్రస్తుతం వెన్నుపొడిచే దశలో 90 శాతం వరిచేను ఉంది. మిగిలింది కూడా పొట్టదశలో ఉంది. నీటికి కూడా ఢోకా లేకపోవడం వల్ల ఈసారి గతం కన్నా మెరుగైన దిగుబడి వస్తుందన్న ఆశాభావంతో రైతులు ఉన్నారు. కానీ, ప్రస్తుతం మొంథా తుపాను కలవరపాటుకు గురిచేస్తోంది. విజయనగరం జిల్లాలో సీజన్ ప్రారంభం (జూన్ నెల) నుంచి ఇప్పటి వరకు 83 రోజులపాటు వర్షం కురిసింది. దాదాపు 15 మి.మీ అధిక వర్షపాతం నమోదైంది. మన్యం జిల్లాలో ఇంకా ఎక్కువ రోజులు వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే చెరువులు, జలాశయాలు నిండివున్నాయి. పంట పొలంలో కూడా నీరు చేరి ఉంది. నీరు ఇలాగే ఉంటే కోతకు కూడా ఇబ్బంది కలుగుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో మరింతగా వర్షం పడితే చెరువులు, పొలాల గట్లకు గండిపడే ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మరోవైపు గాలులు కూడా భీకరంగా వీస్తుండడంతో చేను నేలకొరిగితే పంట నేలపాలు అయినట్టేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పత్తి, మొక్కజొన్న అలా నష్టం జరిగితే.... వరి పంటకు చివరి దశలో ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొంటున్నాయంటూ రైతులు భయంతో ఉన్నారు.



సాలూరులో నేలకొరిగిన వరిచేను



తోటపల్లి నుంచి విడుదల చేస్తున్న నీరు

నిండుకుండలా తోటపల్లి జలాశయం

గరుగుబిల్లి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలో ఉల్లిభద్ర వద్ద గల తోటపల్లి జలాశయంలో పూర్తిస్థాయిలో నీరు చేరడంలో నిండుకుండలా కనిపిస్తోంది. సోమవారం నాటికి ఎఫ్ఆర్ఎల్ 105.00 మీటర్లు ఉందని ఇరిగేషన్ జెసి కిశోర్ తెలిపారు. బ్యారేజి సామర్థ్యం 2.534 టిఎంసి లాగా కాగా, లెవెల్ 103.14 టిఎంసి ఉందని తెలిపారు. ఇన్‌ఫ్లో సామర్థ్యం 11637 క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 2807 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు గేట్లును ఓపెన్ చేశామన్నారు. కావున బ్యారేజ్ పరిసర ప్రాంతాల్లో గల ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలు

పాలకొండ : తుఫాన్ కారణంగా మండలంలో సోమవారం ఉదయం నుంచి వర్షాలు మొదలయ్యాయి. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అదేవిధంగా చేతికి అందాల్సిన పంట ఏమవుతోందనని రైతులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని గారంకాలనీ, గాయత్రి నగర్ తదితర ప్రాంతాలు జలమయ్యాయి. అన్నవరం, గోపాలపురం, అంపిలి, చిన్నమంగళాపురం, గొట్టుమంగళా పురం తదితర నాగావళి నది తీర ప్రాంతాలు ప్రజలు వరద భయంతో ఆందోళన చెందుతున్నారు.



సువర్ణముఖిలోకి 1000 క్యూసెక్కుల నీరు విడుదల

మక్కువ : తుఫాన్ కారణంగా మధ్యతర సాగు నీటి ప్రాజెక్ట్ వెంగళరాయసాగర్ నుంచి సువర్ణముఖి ప్రధాన రెగ్యులేటర్ నుంచి 1000 క్యూసెక్కల నీటిని నదిలోకి విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఎఇ రాజశేఖర్ తెలిపారు. ప్రాజెక్టులో 80శాతం మేరకు నీటి నిల్వ ఉండేలా చూస్తూ, నదుల ద్వారా వచ్చే అదనపు నీటిని తిరిగి నదుల్లోకి పంపించినట్లు ఆయన వెల్లడించారు. ప్రస్తుతం సువర్ణముఖి రెగ్యులేటర్ 2,3 గేట్లును ఎత్తివేసి నదిలోకి నీటిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు.



బొడ్లగూడలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు శ్రీనివాసరావు, తిరుపతిరావు

కోరన్న, మంగన్న వర్ధంతిని జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశకిత - గుమ్మలక్ష్మీపురం

శ్రీకాకుళం రైతాంగ పోరాట వీరులు కామ్రేడ్ కోరన్న, మంగన్న వర్ధంతి సభను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు మండంగి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని లోవముఠా ప్రాంతమైన బొడ్లగూడ, బెల్లిడి గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ హక్కుల కోసం గిరిజనుల పక్షాన ఉంటూ ఎన్నో పోరాటాలు చేశారని పేర్కొన్నారు. పోరాట యోధుల ఫలితంగా 1/70 చట్టం, ఐటిడిఎ, జిసిసి ఏర్పడ్డాయన్నారు. అయితే నేటి పాలకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వీటిని నిర్వీర్యం చేసే దిశగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కావున ఐక్య పోరాటాలు చేసి హక్కులు, చట్టాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 31న కురుపాం మండలం మామినిమానుగూడలో జరుగు కోరన్న, మంగన్న వర్ధంతి సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పువ్వల తిరుపతిరావు, గ్రామ పెద్దలు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు.

పారదర్శకమైన ఓటర్ల జాబితాకు సహకరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో నాణ్యమైన, పారదర్శకమైన ఓటర్ల జాబితాకు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత తెలిపారు. సోమవారం తన ఛాంబరులో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితాను తయారు చేయడంలో బిఎల్ఒతో సహకరించాలని కోరారు. రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితాలకు సంబంధించిన సూచనలు, ఓటర్ల జాబితా నాణ్యత, స్వచ్ఛతను మెరుగు పర్చడానికి సూచనలను అందించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు వారం రోజుల కంటే ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉన్న అన్ని ఫారాలను క్లియర్ చేయాలని, చట్టబద్ధమైన వ్యవధిలోపు అన్ని ఫారాలను రోజువారీగా సకాలంలో చేరవేయాలని ఆదేశించారని అన్నారు. అందులో భాగంగా ఈ ఏడాది జనవరి 6 నుంచి ఇప్పటివరకు 6,933 అన్ని రకాల దరఖాస్తులను స్వీకరించగా, అందులో 165 మాత్రమే పెండింగులో ఉన్నాయని, 799 దరఖాస్తులను రిజక్ట్ చేసినట్లు చెప్పారు. మిగిలిన 5,969 ఇ-రోల్ అయినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అన్ని పార్టీలకు చెందిన రాజకీయ పక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలో ఇటీవల జరిగిన గిరిజన విద్యార్థుల మరణాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ తెలిపారు. సీతంపేట ఐటిడిఎలో మరణించిన గిరిజన విద్యార్థి కుటుంబానికి పరిహారం ఇస్తామని అక్కడ అధికారులు ప్రకటించారని, అదే మాదిరిగా పార్వతీపురం ఐటిడిఎలో కూడా మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పద్మాపురం వసతిగృహ విద్యార్థుల తరలింపు

తుపాను నేపథ్యంలో పాచిపెంట జెడ్‌పి హైస్కూల్‌కు.. 'ప్రజాశక్తి' కథనానికి స్పందించిన అధికారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / పాచిపెంట

జిల్లాలోని పాచిపెంట మండలం పద్మాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలను అధికారులు ఖాళీ చేయించారు. అక్కడ విద్యార్థులను తాత్కాలికంగా పాచిపెంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తరలించారు. 'శిథిలాల మధ్య సంక్షేమం' అన్న శీర్షికతో ప్రజాశక్తిలో సోమవారం ప్రత్యేక కథనం వెలువడిన సంగతి విదితమే. దీనిపై స్పందించిన ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి వసతి గృహాన్ని ఖాళీ చేయించేందుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానిక తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ బివిజె పాత్రో, ఎంఇఒ పి.సతీష్ నాయకత్వంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు పద్మాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అసలే అన్ని భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. మరోవైపు తుఫాను ముంచుకొస్తుంది. ఈ నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని తొలుత ఇదే మండలంలోని బడ్నాయకవలస గిరిజన ఆశ్రమ పాఠశాలకు తరలించేందుకు నిర్ణయించారు. మరోవైపు భారీ వర్షాలు, పెనుగాలుల హెచ్చరికలు అమలులో ఉండడంతో సమీపంలోని పాచిపెంట జిల్లా పరిషత్ పాఠశాలకు తరలించేందుకు నిర్ణయం మార్చుకున్నారు. విద్యార్థుల పుస్తకాలు, పెట్టెలు తదితరాలన్నీ అధికారులు దగ్గరుండి జడ్పీ పాఠశాలకు తరలించారు. వారంతా రాత్రి పూట బస చేసేందుకు వీలుగా కొన్ని గదుల్లో లైట్లు, ఫ్యానులు అమర్చారు. భోజనం మాత్రం స్థానికంగా వంటశాల లేనందున పద్మాపురం వసతి గృహంలో వండి జడ్పీ పాఠశాలకు తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు. తుఫాను అనంతరం కూడా తమ పిల్లలను భద్రత కలిగిన భవనంలోకి తరలించాలని, తిరిగి పద్మాపురంలోని పాత భవనంలోకి తీసుకెళ్తే భయానక పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



హాస్టల్ విద్యార్థులను పాచిపెంట జెడ్‌పి హైస్కూల్‌కు తరలిస్తున్న అధికారులు

ఆకట్టుకున్న ఓపెన్ హౌస్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు, పలు పాఠశాలల, కళాశాలల విద్యార్థులు తరలివచ్చారు. ఎస్పీతో పాటు ఇతర పోలీసు అధికారులు 'ఓపెన్ హౌస్'లో విద్యార్థులతో మమేకమయ్యారు. అనంతరం ఎస్‌పి, ఎఆర్ అధికారులు, సిబ్బంది పోలీసుశాఖ విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ ఆయుధాలు, అత్యాధునిక పరికరాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ - విధి నిర్వహణలో తీవ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరుల సంస్మరణార్థం ఓపెన్ హౌస్" కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ ఓపెన్ హౌస్‌లో పోలీసుశాఖ ఉపయోగించే సాంకేతికత, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ వివిధ ఆయుధాలను విద్యార్థులకు చూపించి వాటి గురించి వివరించారు. అలాగే శక్తి యాప్, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రోన్ పోలీసింగ్ ఏవిధంగా చేస్తారో, నేరస్తులను కనిపెట్టడంలో డాగ్స్ వహించే కీలక పాత్ర గురించి వివరించారు. అనంతరం జిల్లా ఎస్పీ డాగ్(శాండీ) పుష్ప గుచ్ఛాన్ని అందజేసి గౌరవ వందనం చేయగా, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డాగ్ స్క్వాడ్ పనితీరును తన కర్తవ్య నిర్వహణలో భాగంగా ఎన్ని అడ్డంకులు ఎదురైనా దాటకుంటూ లక్ష్యాన్ని ఛేదించేందుకు ఉపయోగపడే హర్డిల్స్ జంపు విన్యాసాలను పోలీసు డాగ్స్ నేరస్తులను మెటీరియల్‌ను ఏవిధంగా గుర్తిస్తుందన్న విషయాలను డాగ్స్ ట్రైనర్ ఆధ్వర్యంలో డెమో చేయించి చూపారు. విన్యాసాల్లో పోలీసు డాగ్స్ చూపిన క్రమశిక్షణ, హ్యాండలర్స్ ఆదేశాలు పాటించే తీరు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ట్రాకర్ డాగ్స్ శాండీ, డాగ్ చార్లీ విన్యాసాలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ థామస రెడ్డి, పార్వతీపురం పట్టణ సిఐ మురళీధర్, రూరల్ సిఐ రంగనాథం, ఎస్‌బి ఎక్స్ సిఐ రమేష్, ఎఆర్, ఆర్ఐలు రాంబాబు, నాయుడు, శ్రీనివాసరావు, ఎఆర్ ఆర్ఎస్ఐలు, ఎస్సైలు, సిబ్బంది, కమ్యూనికేషన్, శక్తి, సైబర్ టీం సిబ్బంది, పాఠశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



పోలీసులు వినియోగించే ఆయుధాలు గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్‌పి

గుమ్మలక్ష్మీపురం : పోలీసు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ పోలీస్ విధులు, బాధ్యతలు, వాకీ టాకీ, ఆయుధాలు వినియోగంపై అవగాహన కల్పించారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులది కీలక పాత్ర అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగాలో బంగారు పతకం

శృంగవరపుకోట : విశాఖపట్నం సిఎంఆర్ ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన 38వ యోగాసన ఛాంపియన్ షిప్ పోటీలో ఎస్‌కోట యోగా శిక్షకులు బొబ్బిలి రామకృష్ణ (50-60 విభాగంలో) ఉత్తమ ప్రతిభ చూపారు. ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ కె.ప్రసాద్ బంగారు పతకాన్ని, ధృవపత్రాన్ని అందుకున్నారు. సర్వేపల్లి విద్యా నికేతన్ పాఠశాల విద్యార్థులు బొబ్బిలి హృషీకేశ్, లాస్యశ్రీ (8-14 సబ్ జూనియర్ విభాగం)లో పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపారు. ఇండియన్ యోగా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ పురోహిత్ వీరికి ధ్రువపత్రాలు అందజేశారు.

విద్యార్థుల మరణాలకు గురువులా బాధ్యులు?

- మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వ వైఫల్యం
- గిరిజన సంక్షేమ పాఠశాలల్లో సమస్యలు కోకొల్లలు
- టీచర్లను బలి చేయడంపై సంఘాల్లో వ్యతిరేకత
- విచారణకు రంగంలోకి మానవ హక్కుల కమిషన్

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాలకు ఉపాధ్యాయులను బాధ్యులు చేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. ఎవరో ఒకర్ని బాధ్యులను చేసి చేతులు దులుపుకునే యత్నంలో జిల్లా అధికారులు వున్నట్లు కనిపిస్తోంది. విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురికావడానికి అసలు కారణాలు అధికారులకు, జిల్లా పాలకులకు బాగా తెలుసు. కానీ విద్యార్థులు మరణించిన పాఠశాల హెచ్ఎం, వార్డెన్లను బలిపశువులు చేయడం సుడి ఒక దగ్గర చురక మరో దగ్గర అన్న చందంగా తయారైంది. గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో ఎక్కువగా విద్యార్థుల మరణాలు జరుగుతున్నాయి. ఈ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కొరత గత కొంతకాలంగా వేధిస్తోంది. రక్షిత మంచినీటి సరఫరా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్ల నిర్మాణం, ఆరోగ్య పరిరక్షణ కోసం ఎఎన్ఎంలు లేకపోవడం వంటి సమస్యలు గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలలను వెంటాడుతున్నాయి. ఈ సమస్యలు దాదాపు అన్ని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో వున్నాయనేది జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకూ తెలుసు. ఏళ్ల తరబడి ఈ సమస్యలను పరిష్కరించడం లేదన్న విషయం కూడా ప్రభుత్వం దృష్టిలో వుంది. గత ప్రభుత్వ హయాంలో అన్ని గిరిజన సంక్షేమ పాఠశాలల్లో రక్షిత మంచినీటి సరఫరా కోసం ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటిలో 90 ప్లాంట్లు పని చేయడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిపోయింది. గత ప్రభుత్వ హయాం నుంచి వెంటాడుతున్న ఈ సమస్యలు ఇప్పుడున్న ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయి. పాడైన వాటర్ ప్లాంట్లను మరమ్మతు చేయకుండా వదిలేయడంతో విద్యార్థులకు రక్షిత మంచినీరు అందడం లేదు. ఇది జగమెరిగిన సత్యం. వాటర్ ప్లాంట్లు పని చేయకపోవడం తో వేడి చేసిన నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెపుతున్నా ఆచరణలో మాత్రం అది కనిపించడం లేదు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడం తరచూ అనారోగ్యానికి గురి కావడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇంతవరకు జిల్లాలో ఒక్క పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో 14మంది విద్యార్థులు మృతి చెందారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సంచలనానికి కేంద్ర బిందువైన కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థినుల అస్వస్థత విషయం గిరిజన సంక్షేమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల డొల్లతనాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేసింది. 600మందికి పైగా విద్యార్థులు ఉన్న గురుకుల పాఠశాలలో రక్షిత మంచినీటి సరఫరా, మరుగుదొడ్లు, తగిన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పచ్చకామెర్లు విజృంభించింది. ఈ వ్యాధి అప్పటికప్పుడు వచ్చిన రోగం కాదు. గత కొన్నేళ్లుగా విద్యార్థినులు అసౌకర్యాల వసతి గృహాల్లో మగ్గుతూ తీవ్ర అస్వస్థతకు గురయ్యారనేది వాస్తవం.

కలుషిత తాగునీరు వినియోగం వల్లే విద్యార్థినులు పచ్చకామెర్లు బారిన పడ్డారనేది బహిరంగ రహస్యం. అలాంటి సమస్యలు పరిష్కారానికి నోచుకోక పోవడం వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. దాదాపు అన్ని ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాలకు ఇవే సమస్యలు కారణాలుగా కనిపిస్తున్నా ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం పై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కురుపాం గురుకుల పాఠశాలలో విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురికావడంతో అక్కడ ప్రిన్సిపాల్, ఎఎన్ఎంను సస్పెండ్ చేశారు. మామిడిపల్లి, ఎర్ర సామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలకు హెచ్ఎంలను బాధ్యులు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వానికి నివేదిక లిచ్చి పరిష్కారమయ్యేలా చూడాల్సిన బాధ్యత ఐటిడిఎ పిఒ, జిల్లా కలెక్టర్‌పై ఉంటుంది. అంతకన్నా మించి స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులూ బాధ్యత వహించాలి. వారి బాధ్యతారాహిత్యాన్ని చిరుద్యోగులపై నెట్టి చర్యలు తీసుకోవడం వివాదాస్పదమవుతోంది. పాఠశాల హెచ్ఎం, వార్డెన్లను సస్పెండ్ చేయడంపై గిరిజన, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లా అధికారుల చర్యలను తప్పు పడుతున్నాయి.

విచారణకు రంగంలోకి ఎన్ హెచ్ఆర్ సి

గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురికావడంపై జాతీయ మానవహక్కుల కమిషన్ రంగంలోకి దిగనుంది. వాస్తవ పరిస్థితులను తెలుసుకుని మరణాలు, అస్వస్థతకు గల కారణాలకు ఎవరి బాధ్యత ఎంతనేది నిర్ధారణకు కమిషన్ సభ్యులు నేడో, రేపో జిల్లా పర్యటనకు రానున్నారు. జిల్లాకు చెందిన మాజీ డిప్యూటీ సీఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణి, అరుకు ఎంపి డాక్టర్ తనూజారాణి నాయకత్వంలో వైసిపి గిరిజన నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు ఇటీవల జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌ను ఢిల్లీ వెళ్లి కలిశారు. విద్యార్థుల మరణాలపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే విద్యార్థుల మరణాలు, అనారోగ్యంతో బాధపడుతున్నారని ఫిర్యాదు లో పేర్కొన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యులు నేడో రేపో జిల్లా పర్యటనకి రానున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గిరిజన విద్యార్థులు మరణించిన పాఠశాలలను కమిషన్ సభ్యులు సందర్శించనున్నట్లు తెలుస్తోంది.

కమిషన్ సభ్యులకు వినతులివ్వాలి

పి.రాజన్నదొర, మాజీ డిప్యూటీ సీఎం

గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై విచారణకు జిల్లాకు వస్తున్న జాతీయ మానవహక్కుల కమిషన్ సభ్యులకు గిరిజన, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఎక్కడికక్కడ వినతులు అందజేయాలి. గిరిజన విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు కారకులెవరన్న దానిపై వివరించాలి. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ సంఘాలు నివేదించాలి. సాలూరు, మక్కువ ప్రాంతంలో పర్యటనకు కమిషన్ సభ్యులు వస్తే నేను కూడా నివేదిక అందజేస్తాను.

ప్రాణ, పంట నష్టం జరగరాదు

అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

మొంథా తుఫాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ముందస్తు చర్యలపై ఇప్పటికే అన్ని మండల కేంద్రాల్లో మాక్ డ్రిల్ నిర్వహించిన సంగతిని కలెక్టర్ గుర్తుచేశారు. అలాగే అన్ని మండల కేంద్రాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే కొంతమందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు కలెక్టర్ వివరించారు. పునరావాస కేంద్రాల్లోని వారికి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. భారీ వర్షాలు పడే అవకాశం ఉండటంతో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అత్యవసర సేవలకు ఆటంకం లేకుండా అధికారులు పనిచేయాలన్నారు. రోడ్లపై విరిగి పడిన కొమ్మలను, చెట్లను ఆర్ అండ్ బి అధికారులు ఇప్పటికే తొలగించి, ఎక్కడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. విద్యుత్ స్తంభాలు విరిగిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు, నష్టాలను గుర్తించేందుకు డ్రోన్లను వినియోగించాలని పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్న కలెక్టర్ ఆ శాఖ చేపడుతున్న పనులపై ఆరా తీశారు. పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

సీతానగరం : తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.వెంకట్రావు అన్నారు. మండలంలోని చినబోగిలిలో సోమవారం ప్రజలకు తుఫాను పట్ల అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సువర్ణముఖి నది పక్కనే ఉన్నందున ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నదీపరివాహక ప్రాంతాల్లోకి వెళ్లకూడదని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ తుఫాను మూడు రోజులు ఉంటుందని, కావున అధికారులు అప్రమత్తంగా ఉండి, ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి పెంట తిరుపతిరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కురుపాం : తుఫాన్ నేపథ్యంలో మండలంలోని నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు మొండెంఖల్‌లో అగ్నిమాపక సిబ్బందిని కలిసి ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఇంటికి అవసరమైన నిత్యావసర సరుకులన్నీ ముందస్తుగా తీసుకువచ్చి తుఫాను తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు ఎవరో రాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



పాలకొండ : నాగావళి నదీ ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అధికారులు



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

నదీ పరివాహక ప్రాంతాలు పరిశీలన

వీరఘట్టం : తుఫాను ప్రభావంతో నాగావళి నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున సోమవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు నది పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. మండలంలోని కడకెల్లా, కిమ్మి పివిఆర్ పురం, బిటివాడ, పనసనందివాడ తదితర గ్రామాలను పరిశీలించి నాటు పడవ ప్రయాణ రాకపోకలను నిలిపివేయాలని, పడవలు నడిపే వారికి సూచించారు. రాత్రివేళ సమయంలో నది వద్దకు వెళ్లొద్దని గ్రామస్తులకు సూచించారు. కిమ్మి గ్రామాన్ని తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావు, ఎంపిడిఒ బి.వెంకటరమణ, ఎస్ఐ. జి.కళాధర్, ఎఒ సౌజన్య సందర్శించారు. తుఫాను ప్రభావం తీవ్రతగా ఉన్నందున రాత్రి సమయంలో నది వద్దకు ఎవరూ వెళ్లొద్దని అధికారులు గ్రామస్తులకు సూచించారు. అంతే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో బయటికి రావాలని ప్రజలను కోరారు.

నదీ పరివాహక ప్రాంతాలను సందర్శించిన అధికారులు

పాలకొండ: నాగావళి నది పరివాహక ప్రాంతాలైన అన్నవరం, అంపిలి, గోపాలపురం, చిన్నమంగళాపురం, గట్టుమంగళాపురం గ్రామాలను డిఎస్‌పి ఎం.రాంబాబు, తహశీల్దార్ రాధాకృష్ణమూర్తి, ఎంపిడిఒ ఎంవి రంగారావు, సిఐ ప్రసాదరావు, ఎస్సై ప్రయోగమూర్తి తదితరులు సందర్శించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆ ప్రాంతంలో ఉన్న విఆర్‌ఒలు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు అందించారు. అదేవిధంగా ఫైర్ సిబ్బందితో మార్క్ డ్రిల్ నిర్వహించారు.



పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న జడ్జి సౌమ్య జోస్పిన్

ఏకలవ్య పాఠశాలను సందర్శించిన జడ్జి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఏకలవ్య పాఠశాలను జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోస్పిన్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల 23 మంది విద్యార్థులు అనారోగ్యం బారిన పడ్డారని గల కారణాలను ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సి.పూర్ణిమను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తరగతి గదులు, కిచెన్ గది, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎఎన్ఎంలు ఎప్పుడు అందుబాటులో ఉంచి విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్య భద్రతను కూడా కల్పించాలని సిబ్బందిని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై పి. నారాయణరావు పాల్గొన్నారు.



ఏరియా ఆసుపత్రిలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులతో సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రి రోగులతో కిటకిటలాడింది . ఇప్పటికే అన్ని వార్డులు రోగులతో నిండి ఉన్నాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు విద్యార్థులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. దీంతో పాటు ప్రత్యేకంగా టెస్టులు, మూడు పూటలా రౌండ్స్, ఎప్పటికప్పుడు పరీక్షలు తెలిపారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామన్నారు. అలాగే తుఫాన్‌లో భాగంగా ఇప్పటికే రోగులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా జనరేటర్‌తో పాటు చీకటి లేకుండా మూడు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు.

ఆర్‌టిసి కళాసీ చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కార్గో సెంటర్ వద్ద ఇటీవల జరిగిన పేలుళ్లలో నలుగురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వారిలో ఇద్దర్ని మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కెజిహెచ్‌కు తరలించినప్పటికీ సక్రంగా వైద్యం జరగలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకొని పట్టణ ప్రధాన రహదారి పక్కన పుట్‌పాత్‌పై తమలపాకుల వ్యాపారం చేస్తున్న ప్రకాష్ బెహరా ఆర్టీసీ కళాసీ రెడ్డి రమేష్ వైద్యం నిమిత్తం రూ.2వేలు ఆర్థిక సహాయాన్ని సోమవారం ఆర్టీసీ కళాసీ యూనియన్ నాయకులు రాగోలు భాను, అప్పలనాయుడు, సిఐటియు పట్టణ నాయకులు బంకురు సూరిబాబులకు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధ్యాహ్న భోజన కార్మిక సంఘం కార్యదర్శి శాంతికుమారి

పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలకు సిద్ధం కావాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శాంతికుమారి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా పిలుపునిచ్చారు. సోమవారం వీరఘట్టంలో మధ్యాహ్నం భోజన కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ వేధింపులు, ప్రభుత్వ విధానాల వల్ల వచ్చిన ఇబ్బందులు, సమస్యలపై పోరాడుతామని స్పష్టం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన నూతన కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం మండల నూతన కమిటీ ఎన్నికైంది. మండల అధ్యక్షులు లంక నాగమణి, కార్యదర్శి వంజరాపు వెంకటమ్మ, సభ్యులు ఎం.రేబకా, ఇప్పిలి రవణమ్మ, పి.అరుణ, పి.వరలక్ష్మి, కుమారి, పి.ఈశ్వరమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వంజరాపు వెంకటమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు ఎన్.సింహాచలం, సిఐటియు నాయకులు ఎన్.ప్రసాదరావు, రమణ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు,

అవినీతి రహిత సమాజం కోసం కృషి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అవినీతిరహిత సమాజం కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. రాష్ట్ర విజిలెన్స్ శాఖ ఉత్తర్వులను పురస్కరించుకుని, సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పరిపాలన, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, శానిటరీ, ఇంజనీరింగ్ విభాగాల ఉద్యోగులచే అవినీతిని అంతం చేద్దామని, లంచాలు ఇవ్వం.. తీసుకోమని, లంచాలు నిర్మూలించడంలో సమగ్రత, పారదర్శకత, సుపరిపాలన అత్యున్నత ప్రమాణాలు కొనసాగిస్తామని, ఉద్యోగులంతా నీతి నియమాలను అనుసరిస్తామని, అన్ని రంగాల్లో అవినీతిని నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కమిషనర్‌తో పాటు మేనేజర్, టిపిఎస్, రెవెన్యూ ఆర్‌ఐలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, సచివాలయాల సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జీవన ఎరువులపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పులిపుట్టి పంచాయతీ వెంపలగూడలో సీతంపేట ఎఆర్‌ఎస్ సౌజన్యంతో వెలుగు అసోసియేషన్ సమన్వయంతో జీవన ఎరువులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో రైతులు పండించే పంటలకు సోకే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యల పట్ల ఎఆర్‌ఎస్ శాస్త్రవేత్త వెంకట్రావు రైతులకు అవగాహన కల్పించారు. పంటలు, మొక్కలు పెరుగుదలకు 16 రకాలు సూక్ష్మ పోషకాలు అవసరమని, ఇవి ఎక్కువ పచ్చిరొట్ట ఎరువుల ద్వారా లభ్యమగుతాయని అన్నారు. మంచి పంట సాధించవచ్చని రైతులకు సూచించారు. పోషక లోపం వల్ల పంటలకు కలిగే నష్టాలు కోసం వరి, పత్తి, కంది, శెనగ పంటల కోసం అవగాహన కల్పించారు. రబీలో ఏ రైతు ఏ పంట వేయాలనుకుంటున్నారో వారి ద్వారా రాగి, శెనగ, నువ్వులు మొక్క జొన్న, మినుములు, పెసలు పంటలు వేసేందుకు ప్రణాళికలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో వెంపలగూడ, రేగులగూడ కాలనీ గ్రామాల నుంచి 28 మంది రైతులు వెలుగు అసోసియేషన్ ఏరియా కోఆర్డినేటర్ పాలక నాగేశ్వరరావు, క్లస్టర్ కోఆర్డినేటర్ ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్నడిఎంహెచ్ఒ భాస్కరరావు

వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - సీతానగరం

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక పిహెచ్‌సి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర సమయాల్లో అవసరమైన మందులు, ఐవి ఇంజక్షన్లు, పాముకాటు చికిత్సకు ఏఎస్వి ఇంజక్షన్ల లభ్యతపై తనిఖీ చేశారు. తుపాను విపత్తుల సందర్భాల్లో అత్యవసర చికిత్సా నిర్వహణ విధానంపై అవగాహన కొరకు మాక్ డ్రిల్‌ను నిర్వహించారు. తుఫాన్ సమయాల్లో రోడ్ ప్రమాదాలు, పాము కాటు, డ్రౌనింగ్, బిల్డింగ్ కొలాప్స్ సంభవించే అవకాశం ఉన్నందున వాటికి గురయ్యే వారికి అత్యవసర చికిత్స అందజేసే విధానంపై పిహెచ్‌సిలో మార్క్‌డ్రిల్ నిర్వహించి వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి ఆరోగ్య సమాచారం తీసుకున్నారు. క్షేత్రస్థాయిలో మందులు, నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంచాలని, కాన్పు సమయాల్లో దగ్గర్లో ఉన్న గర్భిణులను ముందస్తుగా ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. అన్ని సమయాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యం నిమిత్తం ప్రజలు ప్రయాసపడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు, డిపిఎంఒ డాక్టర్ పిఎల్ రఘుకుమార్, వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి, సిహెచ్ఒ ఎస్.వి రమణ, సూపర్వైజర్లు రవణమ్మ, భవాని, గోపాల్ నాయుడు, వైద్య సిబ్బంది,108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : తుపాను ప్రభావం కారణంగా వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని వీటిని దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పిహెచ్‌సిలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించి జ్వర పీడితులు గుర్తించి వారికి వైద్యం అందించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతి కుమారి, ఒ.సుభార్ధమని, కెవి రమణమూర్తి, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

200 లీటర్ల నాటు సారా స్వాధీనం

కురుపాం : కురుపాం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గల జోగిరాజుపేట సమీపంలో సోమవారం సాయంత్రం ఆటోలో చినమేరంగికి చెందిన వెలగాడు చందు, రాయిపల్లి డాక్టర్ అనే ఇద్దరు వ్యక్తులు 20 క్యాన్లతో 200 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టుకుని సారాను స్వాధీనం చేసుకుని వారిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎక్సైజ్ సిఐ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా ఎవరైనా అమ్మినా, తయారు, రవాణా చేసిన అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతోనే పార్టీ అభివృద్ధి

ప్రజాశక్తి - సీతానగరం

వైసిపి కార్యకర్తల సమన్వయంతోనే పార్టీ అభివృద్ధి అవుతుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు అన్నారు. మండలంలోని పాపంవలసలో వైసిపి అనుబంధ కమిటీల నియమకపత్రాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జోగారావు సూచనల మేరకు గ్రామాల్లో గ్రామ, బూత్ కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. మండలంలో ఇప్పటికి దాదాపు అన్ని పంచాయతీల్లో బూత్, గ్రామ కమిటీలు పూర్తికావచ్చాయన్నారు. మిగిలిన గ్రామాల్లో పూర్తి చేస్తామన్నారు. వీటితో పార్టీ అభివృద్ధి చెందుతుందని, స్థానిక ఎన్నికల్లో వైసిపి సత్తా చాటుతుందని అన్నారు. కార్యక్రమంలో పాపంవలస మాజీ సర్పంచ్ రెడ్డి జగదీశ్వరరావు, వైసిపి నాయకులు శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, గాదెలవలస సర్పంచ్ బి.తిరుపతిరావు, మండల నాయకులు కూర్మినాయుడు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కందిరీగల దాడిలో మహిళకు గాయాలు

ప్రజశక్తి - కురుపాం

కందిరీగల దాడిలో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో గల రెల్లి వీధిలో సోమవారం జరిగింది. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం కె.వెంకాయమ్మ బహిర్భూమికి వెళ్లిన నేపథ్యంలో కందిరీగలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్య సిబ్బంది చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నిత్యం ప్రజలపై కందిరీగలు దాడి చేస్తున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అటవీ శాఖ అధికారులు స్పందించి శాశ్వతంగా కందిరీగలు బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

నందబలగలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని నందబలగ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించి 21 పశువులకు సాధారణ చికిత్సలు, 25 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 32 దూడలకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ జె. నరేంద్ర కుమార్, డాక్టర్ ఈ. అరుణ బాడంగి, వాడాడ పశువైద్యులు ఎం. సతీష్ కుమార్, ఎం.సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ గుల్లిపల్లి శ్రీనివాసరావు, ఎంపిటిసి అక్కేన నూకంనాయుడు, పశువైద్య సహాయకులు పాడి రైతులు పాల్గొన్నారు

మొర్రోమంటున్న మొక్కజొన్న రైతు

వరుస వానలతో పంటంతా రోడ్లపైనే

ప్రజాశక్తి - మక్కువ

గత కొద్ది రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు కారణంగా వరుసగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న రైతులు లోబోదిబోమంటున్నారు. పంట చేతికొచ్చే దశలో వర్షాలు అధికంగా పడుతూ మొక్కజొన్నను ఎండబెట్టినవ్వకుండా చేస్తుందని ఆవేదన చెందుతున్నారు. పంటంతా రోడ్లపైనే ఆరబెడుతున్నప్పటికీ, పూర్తిగా ఎండకపోగా వర్షాలకు తడిచి మళ్లీ మొక్కలు మొలకెత్తే పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు. మరోవైపు మొక్కజొన్న పిక్కలు గ్రేడింగ్ పేరుతో వ్యాపారులు తగినంత ధర చెల్లించక నష్టపోవాల్సి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయకపోవడంతో పెట్టుబడులు కూడా రాక అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తడిసిన మొక్కజొన్న పంట విక్రయానికి ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని వారు కోరుతున్నారు.



రోడ్డుపై టార్పాళ్లతో కప్పి ఉంచిన పత్తి

పిపిపిని వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మెడికల్ కళాశాలల ప్రవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ జియమ్మవలస మండలం పెదబుడ్డిడిలో సోమవారం వైసిపి నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల్లో సంతకాల సేకరణ చేపట్టారు. మాజీ ఎంపిటిసి సీమల బాబుమోహన్ రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పిపిపి విధానంతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా పోతుందన్నారు. ఈ విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైసిపి కన్వీనర్ కోట రమేష్ తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : పేద విద్యార్థులను వైద్యవిద్యను దూరం చేయడమే కూటమి ప్రభుత్వం ముఖ్యోద్దేశమని పాలకొండ నియోజకవర్గం వైసిపి యువజన విభాగం అధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు అన్నారు. మండలంలోని తెట్టంగిలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రచ్చబండ కార్యక్రమంలో భాగంగా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తెచ్చి అందులో ఏడు పూర్తి చేసి ఆరోగ్యశ్రీ పరిధిని పెంచి ప్రజలకు ఆరోగ్యసేవలందించిందన్నారు. ఏది మంచి ప్రభుత్వం, ఏది ముంచే ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలు గ్రహించాలన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పి పరిశినాయుడు, ఎస్.సత్యంనాయుడు, ఎ.ఏలియా తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు కుట్ర చేస్తుందని కోటి సంతకాలతో ప్రజలు వ్యతిరేకించాలని ఎంపిపి సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి అన్నారు. ఆదివారం పెదమానాపురం, ఎస్.బూర్జవలస, శికారుగంజి, పెదకాద గ్రామాల్లో వైసిపి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వైద్య కళాశాలలు ప్రయివేటీకరణ చేస్తే కలిగే నష్టాలు గురించి ప్రజలకు వివరించి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జియ్యమ్మవలసలో సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

డెంకాడ: మండలంలోని డెంకాడ, నాతవలస, సింగవరం, దొడ్డుపాడువ, గునుపూరు గ్రామాల్లో వైసిపి ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు పిన్నింటి తమ్మినాయుడు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేస్తుందని ఇంటింటికీ తిరిగి వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బమ్మిడి వెంకటరమణ నాయుడు, అప్పలస్వామి, భావన శ్రీనివాసరావు, పాండురంగ ఆదినారాయణ, శ్యామల రావు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని ఉప్పాడపేటలో మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వైసిపి మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఉపాధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి సుందర హరీష్, నాయకులు పచ్చపాల గురునాథ్‌రావు, నాయకులు బైరెడ్డి యర్రప్పల నారాయణరెడ్డి, దాట్ల శ్రీనివాసరాజు, కర్రోతు వెంకటరమణ, బైరెడ్డి రమణారెడ్డి, కొల్లి రామూర్తి, పట్న తాతీయులు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని వీరనారాయణంలో సోమవారం నిర్వహించిన కోటి సంతకాలు సేకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలనే లక్ష్యంతో జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించే ప్రయత్నాలను వైసిపి బలంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ కార్యక్రమములో జెడ్‌పిటిసి మమ్ములూరి వెంకటలక్ష్మి, వైసిపి మండల అద్యక్షులు మోపాడ కుమార్, నాయకులు కూనిరెడ్డి వెంకటరావు, ఎడ్ల కిషోర్‌కుమార్, వీరనారాయణం సర్పంచ్ మమ్ములూరి సరోజిని, సోంబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



భోగాపురంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్నవైసిపి నాయకులు

పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ సిబ్బందికి వక్తృత్వం, వ్యాసరచన పోటీలు విజయవంతంగా నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రస్తుత కాలంలో పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర అన్న అంశంపై పోటీలు నిర్వహించబడ్డాయి. పోటీల్లో పాల్గొన్న వారు తమ ఆలోచనలను స్పష్టంగా, విశ్లేషణాత్మకంగా, ప్రేరణాత్మకంగా వ్యక్తపరిచారు. పోలీస్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోలీసింగ్‌లో వస్తున్న మార్పులు, సీసీటీ సర్వైలెన్స్, సైబర్ క్రైమ్ దర్యాప్తులు, డ్రోన్ పోలీసింగ్, సిసిటిఎన్ఎస్, డిజిటల్ ఆధారిత నేర నియంత్రణ పద్ధతులపై తమ అభిప్రాయాలను తెలిపారు.



సచివాలయ సిబ్బందికి వినతిని అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

పిపిపి విధానం రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచన విరమిం చుకోవాలని, తక్షణమే పిపిపి విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మండలంలోని తాడికొండ సచివాలయంలో వినతి అందించారు. సంఘం మండల అధ్యక్షులు ఎం.సన్యాసి రావు మాట్లాడుతూ పేదలకు వైద్యమందాలంటే వైద్యవిద్య, ప్రజారోగ్య వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలన్నారు. కూటమి ప్రభుత్వం పిపిపి మోడల్ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టి ప్రభుత్వం భద్రత నుంచి తప్పుకో వడానికి చూస్తోందన్నారు. వైద్య విద్య ప్రైవేట్‌పరమైతే పేద విద్యార్థులకు అంద ని ద్రాక్షగా ఉంటుందన్నారు. కావున పిపిపి విధానం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.జగ్గారావు, నాయకులు కె.సుబ్బారావు ఉన్నారు.

తుపాను పట్ల రైతులు అప్రమత్తం

ప్రజాశక్తి - సాలూరు

మొంథా తుఫాన్ ప్రభావంతో రానున్న రెండు రోజులు మండలంలో అధిక వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి కె.శిరీష సూచించారు. మండలంలో మొక్కజొన్న కోసి, ఆడించిన (పొట్టు తీసిన) గింజలను వర్షానికి తడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఇందుకోసం టార్పాలిన్ కవర్లను లేదా అందుబాటులో ఉన్న ఏదైనా సురక్షితమైన గోదాముల్లో భద్రపర్చుకోవాలని ఆమె సూచించారు. వరి, పత్తి పంటలకు సంబంధించి పొలంలో అధిక మొత్తంలో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని, వాన నీరు బయటకు తొలగిపోయేలా తక్షణమే తగిన కాలువలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభించండి

బొబ్బిలి : మున్సిపల్ ప్రజలకు తాగునీరు అందించేందుకు సీతానగరం సువర్ణముఖి నుంచి నూతన పైపులైన్ పనులు ప్రారంభించి పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ సిఇ ప్రభాకరరావును ఎమ్మెల్యే బేబినాయన కోరారు. స్థానిక కోటలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యేను పబ్లిక్ హెల్త్ అధికారులు కలిశారు. మున్సిపల్ ప్రజలకు సంపూర్ణంగా తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో రూ.123 కోట్లు మంజూరు చేస్తే గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు జరగలేదని చెప్పారు. పైపులైన్ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు సిఇ ప్రభాకర్ చెప్పారు. అయనతో మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, డిఇ కిరణ్ కుమార్, తదితరులు ఉన్నారు.

సేవలతోనే రోటరీకి గుర్తింపు తేవాలి

బొబ్బిలి : సామాజిక సేవల ద్వారా రోటరీ సంస్థకు సమాజంలో మంచి గుర్తింపు తీసుకొని రావాలని రోటరీ డిస్ట్రిక్ట్ 3020 పబ్లిక్ ఇమేజ్ జిల్లా చైర్మన్ డాక్టర్ సంజయ్ సభ్యులకు సూచించారు. సోమవారం ఆయన బొబ్బిలి రోటరీ క్లబ్‌ను సందర్శించారు. అనంతరం ఎన్‌అర్‌ఐ హాస్పిటల్ కాన్ఫరెన్స్ మందిరం లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోటరీ సభ్యులు ప్రతివారికి రోటరీ సంస్థను పరిచయం చేయాలన్నారు. డిసెంబర్ 7న గోదావరి జిల్లా పాలకొల్లులో రోటరీ డిస్ట్రిక్ట్ పబ్లిక్ ఇమేజ్ సెమినార్‌ను నిర్వహిస్తున్నామని జిల్లాలో ఉన్న క్లబ్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు సభ్యులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు. సమావేశంలో రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు, పూర్వ అద్యక్షులు సింద్రీ శ్రీనివాసన్, రామ్ ప్రసాద్, రామకృష్ణ, శివకాంత్ పాల్గొన్నారు.